# జాలిగుండె

పచ్చమేడ దగ్గర చాలా కార్లు ఆగి వున్నాయి.

జనం చాలామంది ఉన్నారు.

వెళ్ళేవాళ్ళు వెళ్ళిపోతూనే ఉన్నారద్దీ తగ్గడంలేదు.

* * *

ఆ మేడ గేటు ప్రక్కన నల్లని రాతిపైన బంగారు రంగులో అక్షరాలు ధగధగా మెరుస్తున్నాయి. హ రి శ్చం ద్ర రా వు. వాళ్ళ తాతగారు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారని చెప్పుకుంటూ ఉంటారు. కాబట్టి అలాగే తనూచెప్పుకుని రాజకీయాల్లో కాలేశాడు. మొదట ఆయన మాటను నమ్మి జనం ఓటేశారు. ఆ తరువాత మాట మీద నిలబడలేకపోయిన ఆయన డబ్బుతో ఓట్లని కొనేయాల్సొచ్చింది.

మొత్తానికి ఉద్యోగులకి బోనస్ క్రింద 'బంగారు లోటస్' అన్నాడు. వారానికి నాలుగు పనిదినాలే అన్నాడు. ఉద్యోగి బ్రతికుండగానే వచ్చిన తరువాత వచ్చేలాంటి ఇన్స్యూరెన్స్ పథకం అన్నాడు. మొత్తానికి చాలా చాలా అన్నాడు కార్మికుల బాగోగులు చూసే మనిషిగా ఉన్నప్పుడు.. ఆ తరువాత పదవి మారింది. పార్టీ కూడా మారిపోయాడు ఎందుకైనా మంచిదని... పాత పార్టీని దుయ్యబట్టాడు. ప్రజలకు తనెంతో చేద్దామనుకుంటే ఆ పార్టీవారు ఏమీ చేయనివ్వలేదని అదని, ఇదనీ వాగేసి డబ్బు సంచుల్ని బయటకు లాగి తన 'ఇంటికో నోటు' పథకంతో (రహస్యం) గెలిచేశాడు.

వెనుకబడిన తరగతి వాళ్ళ సంక్షేమం చూసే పొజిషన్ సంపాదించాడు. అది సంపాదించిన కొద్ది రోజుల్లోనే తనక్కావలసిన వాళ్ళు, తను కోరింది ఇచ్చిన వాళ్ళు, తను కావాలనుకున్నవాళ్ళు చాలా మంది ప్రభుత్వం కల్పించే సదుపాయాల కోసం కాగితాలపైన వెనుకబడ్డ తరగతి వాళ్ళయిపోయారు.

'బలహీన వర్గాల వారికి గృహ సముదాయం' పెద్దబ్బాయిని అమెరికా పంపించాడు చదువునిమిత్తం.

'వీధికోలైటు పథకం' కూతురికి ఘనాతిఘనంగా పెళ్ళి జరిపించేశాడు. వారం రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అన్ని శాఖల మంత్రులూ వచ్చి అక్షింతలేశారు.

'కిలో రూపాయిన్నర బియ్యం' అలకపాన్పు ఎక్కి కూర్చున్న అల్లుడుగారికి ఆరు రంగుల 'హారతి' కార్లు కొనిచ్చి దింపేశాడు.

అందరికీ విద్య పథకం అర్ధాంగికి నెదర్‌లాండ్స్‌లో నడుం నొప్పి ఆపరేషను.

ఇవిగాక సైకిల్ రిక్షాలు, తోపుడు బండ్లు... ఇలాంటి వాటినెన్నింటినో వెనుకబడ్డోళ్లకి పంచిపెట్టాడు.

ఎన్నో సన్మానాలు... ఎన్నిచోట్లో ప్రసంగాలు... వారానికోసారి దూరదర్శన్‌లో సందేశాలు...

వెనుకబడ్డ వారిని ఆదుకునే మహానుభావుడిగా శ్లాఘిస్తూ స్వాతంత్ర్య దినోత్సవంనాడు గాంధీభవనంలో 'పేదల పెన్నిధి' బిరుదు ప్రదానం.

ఆ సభ, ఆ బిరుదు— వెనుకబడిన వాళ్ళక్రింద చలామణి అయిపోయేలా చేసినందుకు డబ్బుగల వాళ్ళంతా కలిసి ఏర్పాటు చేసిందే.

కిళ్ళీకొట్టయినా, బార్ అయినా సందేహించడు రిబ్బను కత్తిరించడానికి.

పెట్రోలు ధర పెరిగినందుకు నిరసనగా 'రిక్షా'లో బయటికెళ్ళాడు. పేపర్లు పెద్దగా వ్రాశాయి. ఫోటోవేసి ఇంటర్వ్యూ చేశాయి. ముఖ్యంగా బలహీనవర్గాల ప్రతినిధి, పేదల పెన్నిధి అలా వెళ్ళటం తగదని ఆయన కారువాడితీరాలని అందరూ పట్టుబట్టినట్లు స్టేట్‌మెంట్ ఇచ్చేసి కారెక్కేశాడు ఓ వారం తరువాత.

కాలం చాలా మార్పులు తెస్తుందన్నట్లు కొత్త పార్టీలను పల్టీలు కొట్టించిన పాత పార్టీలు, కత్తిపోట్ల సంఘటనలు, కర్ఫ్యూలు... ఎమ్మెల్యేలను దాచేయడం, కట్టేయడం... ఇలాంటి గందరగోళాలు జరిగిన కొన్నాళ్ళకి పార్టీ కూలిపోవడంతో హరిశ్చంద్రరావు కుమిలిపోయాడు.

''రాజకీయాలకు దూరంగా హరిశ్చంద్రరావు'' వార్తొచ్చింది.

'పదవితో డబ్బు, పలుకుబడి సంపాదించుకున్నాడు. ఇంకెందుకు మనలాంటోళ్ళ సంగతి' వెనకబడ్డోళ్ళు అమాయకంగా అనుకున్నారు.

'పేదోళ్ళకి హరిశ్చంద్రరావు ఏమీ చేయలేదని నిజంగా ఏదైనా చేయదలుచుకున్నవారికి పదవి అంత ముఖ్యమా' అనుకున్నవాళ్ళూ ఉన్నారు.

ఏమైనా వేలెత్తి చూపగలిగే ధైర్యం ఎవరికీ లేదు.

* * *

జనం...

విపరీతమైన జనం

పదవిలో ఉన్నవాళ్ళు... పదవి పోయిన వాళ్ళు

పదవి కోసమే బ్రతుకుతున్నవాళ్ళు..

వస్తున్నారు. పోతున్నారు..

అందరి ముఖాల్లో విషాదం...

ఎన్ని ఫోన్లు... ఎంత మంది డాక్టర్లు...

హాస్పిటల్‌నే ఇంటిదగ్గరికి తీసుకొచ్చారు.

తమ శాయశక్తులా ప్రయత్నించారు. లాభంలేకపోయింది.

'మనిషికి తనమీద నమ్మకంపోయినప్పుడు దేవుడిమీద భారం వేస్తాడేమో..' అదే జరిగింది.

పుష్పగుచ్ఛాలతో వెడుతున్నారు జనం.

హరిశ్చంద్రరావు బంధువర్గం అంతా అక్కడే ఉంది.

అంతా ఊరుకోండి.. ఊరుకోండి అని హరిశ్చంద్రరావుని ఓదార్చి మరీ వెడుతున్నారు.

ఎలా ఊరుకోగలరు?

అది అంత తేలికైన విషయమా?

ఎనిమిదేళ్ళ అనుబంధం అది.

మనిషిలో విశ్వాసం పూర్తిగా సన్నగిల్లిపోతున్నదనేమో కుక్కని మనిషికి దగ్గర చేశాడు దేవుడు. దాన్ని చూసైనా తమలో ఏం తక్కువైందో తెలుసుకోవాలనేమో.

మంత్రవాది మహేశ్వర్

సాయంకాలం దాకా 'టైగర్' బానే ఉంది.

ఆ తరువాతే

రాత్రంతా మూల్గులు వినబడుతూనే ఉన్నాయి.

ఆ ఇంటితో దాని రుణం తీరిపోయింది అంతే



పనివాడు నారాయణ హరిశ్చంద్రరావు దగ్గరగా వచ్చి రహస్యంగా ఏదో చెప్పాడు.

అంతే తాచులా లేచాడు అసలే నిద్రలేక ఎర్రబడ్డ కళ్ళేమో మరింత ఎర్రబడ్డాయి. బాల్కనీ వైపుకొచ్చి ఎదురుగా ఉన్న పాకకేసి చూశాడు. ఒకళ్ళో, ఇద్దరో నిలబడి ఉన్నారు. తోకాడిస్తూ ఓ వీధి కుక్క తిరుగుతోంది.

ఫోన్ దగ్గరికి వచ్చాడు. రిసీవర్ ఎత్తాడు...

రింగు చేయబోయి ఆగిపోయాడు.

క్షణం ఆలోచించాడు...

పాకలో చచ్చిపడి ఉన్న రిక్షా నర్సిగాడి శవం పదినిమిషాల్లో పచ్చమేడలోకి వచ్చింది.

టైగర్‌కు ఓ అడుగు దూరంలో ప్రాణంలేని రిక్షా నర్సిగాడు.

ఎలక్షన్లప్పుడు గొంతెత్తి హరిశ్చంద్రరావుగారికే మీ ఓటు అని అరిచిన నర్సిగాడు.

ఒకసారి ప్రతిపక్షాల గూండాల బారి నుంచి హరిశ్చంద్రరావు ప్రాణాల్ని కాపాడిన నర్సి...

అప్పుతీర్చలేకపోయినందుకు 'రిక్షా' బ్యాంక్ వాళ్ళు స్వాధీనపరుచుకుంటారని ముందురోజు మొరపెట్టుకుందామని హరిశ్చంద్రరావు దగ్గరికెళితే గేటులోకి కూడా రానివ్వలేదు... ప్రాణం ఉన్న నర్సిగాడి కంటే శవమైన నర్సిగాడి విలువ పెరిగింది కాబోలు...

''అయ్యో ఎంత పని జరిగిపోయింది. ఈ లోకం వదిలి వెళ్ళిపోయాడు నర్సిములు... నేను ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించగలిగానంటే కారణం నర్సిములు. అప్పుడే నూరేళ్ళూ నిండిపోయాయా.. ఏమిటి నాకీ పరీక్ష. 'టైగర్' పోయిన బాధ బాధగా ఉండగానే మరో విషాద వార్త...'' భోరు భోరున ఏడ్చాడు హరిశ్చంద్రరావు.

వచ్చిన వాళ్ళంతా హరిశ్చంద్రరావు జాలి గుండెను ప్రశంసించారు ఓదార్చారు.

విశ్వాసం లేని మనుషుల మధ్య ఉండలేక 'టైగర్' వెళ్ళిపోయిందనే విషయం హరిశ్చంద్రరావుకి తెలీదు.

కొత్తగా ఉద్యోగంలో చేరిన పంతులమ్మను ఆ రాత్రి బలవంతంగా అనుభవించడం వల్ల ఆ అవమానానికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న నిజం నర్సిగాడితోనే చచ్చిపోయింది.

హరిశ్చంద్రరావు నర్సిగాడి శవాన్ని వాళ్ళ వాళ్లకు అప్పగించాడు. దహన సంస్కారానికి అయిదొందలిచ్చాడు... ఇంకా కావలిస్తే అడగమన్నాడు.

ఆయన మానవతా దృష్టిని వచ్చిన వాళ్ళంతా ప్రశంసించారు.

'టైగర్' అంతిమ యాత్రకు అయిన పాతిక వేలను ప్రక్కకు పెడితే, నర్సిగాడి కోసం ఇచ్చిన అయిదొందలూ ఎంతో పేరు తెచ్చాయి.

బ్రతికుండగా యాభై రూపాయలు కూడా ఇవ్వని హరిశ్చంద్రరావు ప్రాణంపోయిన మనిషి మీద అయిదొందలతో తన గొప్పతనాన్ని ఎంతో పెంచుకున్నాడు.

అయితే . . .

ఒక్కటి మాత్రం నిజం .

రిక్షా నర్సిగాడు బ్రతికినంతకాలం హరిశ్చంద్రరావు ఖ్యాతిని పెంచడానికే ఉపయోగపడ్డాడు. ఈ రోజున చనిపోయి కూడా ఆయన్ని గొప్పవాడిని చేశాడు.

హరిశ్చంద్రరావు జాలిగుండెకు ప్రశంసలింకా అందుతూనే ఉన్నాయి. ●